సాక్షి
అనంతపురం
గురువారం । 13 । జూలై । 2023



చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.19 వేలు పలికాయి.



ఆకుపచ్చని జీవితాలు

రేకులకుంట రైతులు ఆకుకూరల సాగులో రాణిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో మంచి ఆదాయం గడిస్తున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
36.8°/23.2°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం తగ్గింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

స్నాతకోత్సవానికి రావాలని గవర్నర్‌కు ఆహ్వానం



గవర్నర్‌ను ఆహ్వానిస్తున్న ఎస్కేయూ వీసీ

అనంతపురం: ఈ నెల 17న నిర్వహించనున్న శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ 21వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని యూనివర్సిటీ చాన్సలర్/ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు వీసీ రామకృష్ణారెడ్డి ఆహ్వానపత్రిక అందజేశారు. ఎస్కేయూ అభివృద్ధి పనుల గురించి గవర్నర్ ఆరా తీసినట్లు వీసీ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, స్నాతకోత్సవానికి గవర్నర్ రాక నేపథ్యంలో యూనివర్సిటీ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

అర్హులందరికీ సర్టిఫికెట్లు




సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ గౌతమి

పెద్దపప్పూరు: కుల, ఆదాయ, రేషన్‌కార్డు తదితర సర్టిఫికెట్లు అర్హులందరికీ సత్వరం అందించడమే 'జగనన్న సురక్ష' కార్యక్రమ ఉద్దేశమని కలెక్టర్ గౌతమి అన్నారు. పెద్దపప్పూరు -2 సచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై 76 మంది లబ్ధిదారులకు 11 రకాల సేవలకు సంబంధించిన సర్టిఫికెట్లను అందజేశారు. ఎటువంటి సమస్యలు ఉన్నా, సర్టిఫికెట్లు కావాలన్నా వలంటీర్ల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, స్పెషలాఫీసర్ ప్రభాకర్‌రెడ్డి, తహసీల్దార్ లక్ష్మీనాయక్, ఎంపీడీఓ రామకృష్ణ, ఈఓర్డీ కమలాబాయి, సర్పంచ్ ఓబులమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశాలకు రెండో విడత దరఖాస్తులకు ఆహ్వానం

- ఆగస్టు 3 నుంచి 6 వరకు కౌన్సెలింగ్



రాప్తాడురూరల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2023–24 సంవత్సరంలో రెండో విడత ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్, అనంతపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపాల్ రామమూర్తి తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 31లోపు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఏ ఐటీఐ చేరాలనుకుంటున్నారో ఆ ఐటీఐని ఆన్‌లైన్‌లో ఆప్షన్ పెట్టుకోవచ్చని వెల్లడించారు. ఆన్‌లైన్ దరఖాస్తు అనంతరం సంబంధిత సర్టిఫికెట్లను సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలలో వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఐటీఐల ప్రవేశాలకు ఆగస్టు 3, 4 తేదీలు, ప్రైవేట్ ఐటీఐల ప్రవేశాలకు 5, 6 తేదీల్లో కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రామమూర్తి కోరారు.

రాత.. పచ్చ రోత

అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై 'పచ్చ' పత్రిక విషం చిమ్ముతోంది. అసత్యాలతో కథనాలు అల్లి వడ్డిస్తోంది. ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీలో బహిరంగంగా కుమ్ములాటలు జరుగుతున్నా.. అధిష్టానాన్ని ధిక్కరించి వ్యవహరిస్తున్నా, బడుగులపై అగ్రవర్ణ నాయకులు దాష్టీకం ప్రదరిస్తున్నా, భూకబ్జాలకు పాల్పడుతున్నా కనిపించనట్టు నటిస్తోంది. అధికార పార్టీపై మాత్రం పనిగట్టుకుని ఉన్నవీ, లేనివీ కల్పించి 'అవినీతి' మకిలిని అంటించి తప్పుడు రాతలతో రోత పుట్టిస్తోంది.

- వైఎస్సార్‌సీపీలో క్రమశిక్షణకు పెద్దపీట
- ప్రజల్లో ఉండే నాయకులకే పట్టం కడుతున్న అధిష్టానం
- క్రమశిక్షణ చర్యలకు అవినీతి మకిలి అంటిస్తూ 'ఈనాడు' తప్పుడు రాతలు
- టీడీపీలో నాయకులు రోజూ తన్నుకుంటున్నా అక్షరం ముక్క రాయని వైనం
- శింగనమలలో దళిత నాయకుడిని కొట్టినా పరామర్శించకుండా వెళ్లిపోయిన లోకేష్



సాక్షి ప్రతినిధి, అనంతపురం: 'సంక్షేమం – అభివృద్ధి' అనే నినాదంతో ఆవిర్భవించిందే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. రాజకీయ పార్టీలో వర్గాలుండొచ్చుగానీ, వర్గపోరు ఉండకూడదు. ఇదే నినాదంతో ముందుకెళుతూ ఎవరు క్రమశిక్షణ ఉల్లంఘించినా వారిపై చర్యలు తీసుకునేందుకు అధిష్టానం ఎప్పుడూ వెనుకాడలేదు. మూడు మాసాల కిందట పెనుకొండ నియోజకవర్గానికి చెందిన నాగభూషణంరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. తాజాగా ఉరవకొండ నియోజకవర్గానికి చెందిన మధుసూదన్‌రెడ్డి పార్టీ లైన్ దాటి వ్యవహరించినందుకు పార్టీనుంచి సస్పెండ్ చేశారు. శింగనమల నియోజవర్గానికి చెందిన చామలూరు రాజగోపాల్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చి హెచ్చరించిన విషయం తెలిసిందే. పార్టీలో ఎంతటి వారైనా గీత దాటితే వారిపై అధిష్టానం చర్యలు తీసుకుంటుందనేది తొలినుంచీ తెలిసిందే. క్రమశిక్షణకు మారుపేరు కాబట్టే ఐక్యతతో 2019 ఎన్నికల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 సీట్లకు గాను 12 అసెంబ్లీ సీట్లు సాధించగలిగారు. కుల, మత, వర్గ భేదాలు లేకుండా అన్నిటికీ పార్టీ ఆదేశాలే సుప్రీం అన్న సూత్రం కార్యకర్త నుంచి ఎమ్మెల్యే వరకూ అందరికీ వర్తిస్తుందనేది తెలిసిందే.

'పచ్చ' ప్రేమ.. రోత రాతలు..

తెలుగుదేశం పార్టీకి 'ఈనాడు' పత్రిక కరపత్రంగా మారింది. రోతరాతలు, అబద్ధాలు నిత్యకృత్యమయ్యాయి. తాజాగా 'అక్రమాలమయం–అసమ్మతి స్వరం' అంటూ జిల్లా ఎడిషన్‌లో ఓ తప్పుడు కథనాన్ని వండి వార్చారు. అవినీతిపై ప్రశ్నించినందుకే వారిని పార్టీనుంచి సస్పెండ్ చేశారంటూ రోత రాతలు రాశారు. ప్రశ్నిస్తే కేసులే అంటూ మసాలా కలిపి వండి వడ్డించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో తెలుగుదేశం పార్టీ రోజు రోజుకూ బలహీన పడిపోతున్న విషయాన్ని పక్కన పెట్టి ప్రజల్లో బలం పెరుగుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై 'ఈనాడు' విషం చిమ్మడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

'తమ్ముళ్ల' తన్నులాటను రాయలేని దైన్యం..

తెలుగుదేశం పార్టీలో నాలుగు వర్గాలు, ఆరు తన్నులాటలు అన్న చందంగా ఉంది. ఎక్కడికక్కడ ప్రతిరోజూ బాహాబాహీ జరుగుతూనే ఉంది. కానీ వీటిపై 'ఈనాడు' అక్షరం ముక్క రాయదు.

- నారా లోకేష్ యువగళం పేరుతో పెనుకొండ నియోజకవర్గంలోకి రాగానే సవితమ్మ, బీకే పార్థసారథి వర్గీయులు నడివీధిలో చెప్పులతో కొట్టుకున్నారు. కానీ ఇది రాయలేకపోయారు.
- కళ్యాణదుర్గంలో ఉన్నం హనుమంతరాయ చౌదరి, ఉమామహేశ్వరనాయుడు వర్గీయులు పట్టపగలే నడిరోడ్డుపై తన్నుకున్నారు. ఈ తన్నులాటను ఈనాడు చూడలేక పోయింది.
- శింగనమల నియోజకవర్గంలో తన తండ్రిని కొట్టారంటూ టీడీపీ నాయకురాలు, దళిత మహిళ అయిన బండారు శ్రావణి కన్నీరు పెట్టుకున్నారు. ఆ సమయంలో ఇదే జిల్లాలో లోకేష్ 'యువగళం' పాదయాత్ర నిర్వహిస్తున్నారు. అయినా ఆయన బాధితులను పరామర్శించిన పాపానపోలేదు. ఈ విషయానికి 'ఈనాడు' పాతరేసింది.
- తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అవినీతి అక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా తెరిచిన పుస్తకం కాగా.. ఈనాడు దృష్టిలో అవి ముగిసిన అధ్యాయంలా ఉంది. పదెకరాలు ఆక్రమించి కరివేపాకు పంట పెట్టినా రాసే సాహసం చేయరు. జేసీ సోదరులు టీడీపీలో చేరగానే 'ఈనాడు' దృష్టిలో వారు పునీతులైపోయారు.
- కదిరిలో చాంద్‌బాషా, కందికుంట ప్రసాద్ వర్గీయులు నడిబజారులో తన్నుకున్నా 'ఈనాడు'కు కనిపించవు.
- మడకశిరలో గుండుమల తిప్పేస్వామి అక్రమాలు పట్టవు.

బాగా చదవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

పెద్దపప్పూరు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు బాగా చదివి ఇటు పాఠశాలకు, అటు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ గౌతమి సూచించారు. బుధవారం పెద్దపప్పూరులోని జెడ్పీ హైస్కూలును ఆమె తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. అనంతరం పలు తరగతి గదుల్లోకి వెళ్లి ఉపాధ్యాయుల బోధన ఏ విధంగా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పేద విద్యార్థుల ఉన్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని, సద్వినియోగం చేసుకుని రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీదేవి, హెచ్‌ఎం ఆదినారాయణరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్‌లో అలసత్వం

- జేవీకే కిట్లు అందుకున్న విద్యార్థులతో బయోమెట్రిక్ వేయించని వైనం
- రాష్ట్రంలో 23వ స్థానంలో నిలిచిన అనంతపురం జిల్లా
- మొద్దు నిద్రలో ప్రధానోపాధ్యాయులు



అనంతపురం శారదా మునిసిపల్ స్కూల్ హెచ్‌ఎం, టీచర్లతో జేవీకే-4 బయోమెట్రిక్‌పై మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ పద్మప్రియ

రాప్తాడు రూరల్: స్కూళ్లు పునఃప్రారంభమైన తొలిరోజు నుంచే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జగనన్న విద్యా కానుక (జేవీకే) కిట్లు పంపిణీ చేశారు. వారం రోజుల్లోనే వందశాతం కిట్లు అందజేశారు. దానిని ధ్రువీకరించుకునేందుకు కిట్లు అందుకున్న విద్యార్థుల నుంచి బయోమెట్రిక్ అథెంటికేషన్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనిపై డీఈఓ ఎం.సాయిరామ్ ప్రత్యేక దృష్టి సారించారు. టెలీ కాన్ఫరెన్స్, వెబెక్స్ ద్వారా సమీక్షిస్తూ మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులను ఆదేశిస్తున్నారు. అయినా ప్రధానోపాధ్యాయులు మొద్దునిద్ర వీడడం లేదు. బుధవారం నాటికి 86 శాతం విద్యార్థుల బయోమెట్రిక్ అథెంటికేషన్ పూర్తయింది. రాష్ట్రంలో జిల్లా 23వ స్థానంలో నిలిచింది.

ఎక్కువగా పెండింగ్ ఉన్న స్కూళ్లు..

గుంతకల్లు ఆర్‌పీ మునిసిపల్ 17వ వార్డు స్కూల్‌లో 610, కళ్యాణదుర్గం బాలికల ఉన్నత పాఠశాల 407, జెడ్పీహెచ్‌ఎస్ గుత్తి 396, జెడ్పీహెచ్‌ఎస్ డీ.హీరేహాళ్ 390, అనంతపురం ప్రభుత్వ బాలికల పాఠశాల 380, ఉరవకొండ 9వ వార్డు స్కూల్ 333, జెడ్పీహెచ్‌ఎస్ పెద్దవడుగూరు 313, గుంతకల్లు ఎస్‌జేపీ స్కూల్ 291, జెడ్పీహెచ్‌ఎస్ కొనకొండ్ల 276, జెడ్పీహెచ్‌ఎస్ గోనబావి 231, అనంతపురం పొట్టిశ్రీరాములు స్కూల్ 212, ప్రభుత్వ నంబర్–2 స్కూల్ 206 మంది విద్యార్థుల బయోమెట్రిక్ పెండింగ్ ఉంది.

పలుమార్లు సమీక్షించిన కలెక్టర్ ..

అత్యంత ప్రాధాన్యమైన కార్యక్రమం కావడంతో కలెక్టర్ గౌతమి పలుమార్లు సమీక్షించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జేవీకే–4కు సంబంధించి విద్యార్థుల బయోమెట్రిక్ వెంటనే పూర్తి చేయాలని ఎంఈఓలు, హెచ్‌ఎంలను ఆదేశించారు. ఈ విషయంలో కొందరు ప్రధానోపాధ్యాయులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండిపోతున్నారు. డీఈఓ అయితే సీఆర్పీలు, ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ అసిస్టెంట్ల సాయం ఇచ్చినప్పటికీ కొందరు హెచ్‌ఎంలు లక్ష్యాన్ని చేరుకోవడం లేదు. సమగ్ర శిక్ష అధికారులు ఎంత కుస్తీపడుతున్నప్పటికీ పెండింగ్ సంఖ్య తగ్గడం లేదు.

డెడ్‌లైన్‌లోపు పూర్తి చేయాలి



జగనన్న విద్యా కానుక –4కు సంబంధించి విద్యార్థుల అథెంటికేషన్ ప్రక్రియ అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్నదని ఎంఈఓలు, హెచ్‌ఎంలకు పదే పదే చెబుతున్నాం. కలెక్టర్ పలుమార్లు సమీక్షించారు. గురువారం సాయంత్రం వరకు డెడ్‌లైన్ ఇచ్చాం. ఆలోగా వందశాతం పూర్తి చేయని పాఠశాలల హెచ్‌ఎంలపై చర్యలుంటాయి.
– ఎం.సాయిరామ్, డీఈఓ

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్

అనంతపురం సెంట్రల్: జిల్లా వ్యాప్తంగా 40 అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ పోస్టుల భర్తీకి కలెక్టర్ గౌతమి నోటిఫికేషన్ విడుదల చేశారు. అనంతపురం అర్బన్ ప్రాజెక్టులో 2, శింగనమల 3, నార్పల 5, తాడిపత్రి 3, గుత్తి 6, ఉరవకొండ, 8, కళ్యాణదుర్గం 2, కణేకల్లు 5, కంబదూరు 3, రాయదుర్గం ప్రాజెక్టులో 3 చొప్పున ఖాళీలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అర్హులైన అభ్యర్థులు గురువారం నుంచి ఏడు రోజుల్లోగా సీడీపీఓ కార్యాలయాల్లో దరఖాస్తులు అందజేయాలని కోరారు. ఖాళీల వివరాలు, దరఖాస్తుకు మార్గదర్శకాల గురించి ప్రాజెక్ట్ కార్యాలయాల నోటీసు బోర్డులో అతికించినట్లు పేర్కొన్నారు.

బీసీ కార్పొరేషన్ ఈడీగా సుబ్రహ్మణ్యం

అనంతపురంరూరల్: బీసీ కార్పొరేషన్ ఈడీగా సుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. ఇక్కడ ఇదివరకు ఈడీగా పనిచేసిన నాగముని ఇటీవలే ఉద్యోగ విరమణ చేశారు. దీంతో బీసీ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ ఈడీగా బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూకొఠారికి ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. అయితే రెండు శాఖలను ఒక్కరే పర్యవేక్షించడం కష్టతరమవడంతో చిత్తూరు బీసీ కార్పొరేషన్ ఈడీగా ఉన్న సుబ్రహ్మణ్యంను అనంతపురానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నూతన ఈడీ గురువారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

టీబీ డ్యాంలో 6.891 టీఎంసీల నీరు



బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో హెచ్చుతగ్గుల మధ్య కొనసాగుతోంది. ఎగువన వర్షాలు కురుస్తుండటంతో బుధవారం 17,383 క్యూసెక్కులకు పైగా వరద నీరు జలాశయంలోకి వచ్చింది. డ్యాంలో నీటి నిల్వ 6.891 టీఎంసీలకు చేరింది. వరద ఇలాగే కొనసాగితే నెల రోజుల్లో జలాశయం పూర్తి స్థాయిలో నిండే అవకాశం ఉంది.

ఉన్నతాధికారుల పేరుతో వసూళ్లు చేస్తే చర్యలు

- డీఐజీ మాధవి హెచ్చరిక

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సబ్‌రిజిస్ట్రార్లు ఉన్నతాధికారుల పేరు చెప్పి వసూళ్లు చేస్తే సహించేది లేదని, అలా చేసినట్టు తేలితే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆ శాఖ డీఐజీ మాధవి హెచ్చరించారు. 'రిజిస్ట్రేషన్ శాఖలో అవినీతి జలగలు' అన్న శీర్షికతో బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. రిజిస్ట్రేషన్‌కు వస్తున్న వారి నుంచి వసూళ్లు చేస్తే నేరుగా తమ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించి డాక్యుమెంట్లు సరిగా లేని వారి నుంచి సబ్‌రిజిస్ట్రార్లు వసూళ్లు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. తమ పరిధిలో ఉన్న 21 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల అధికారులపై నిఘా ఉంచామన్నారు.

కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్

- కొనుగోలుదారుకు తెలియకుండా రిజిస్ట్రేషన్ రద్దు
- విచారణ అనంతరం సబ్ రిజిస్ట్రార్‌పై వేటు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖలో మరో వికెట్ పడింది. నెల రోజుల కిందట అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్ మహమ్మద్ ఆలీ, నాలుగు రోజుల క్రితం అనంతపురం అర్బన్ సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణమూర్తి సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. తాజాగా కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ రామ్మోహన్‌ను సస్పెండ్ చేస్తూ ఆ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. 2022 జనవరిలో కళ్యాణదుర్గం నియోజకవర్గం నర్సాపూర్‌కు చెందిన బోగాతి చంద్రమ్మ 4.08 ఎకరాల భూమిని తలారి ఆదినారాయణకు అమ్మింది. ఈ మేరకు రిజిస్ట్రేషన్ పూర్తయింది. తర్వాత కొద్ది నెలలకు ఆదినారాయణ పాసు పుస్తకాలు (1బి) కోసం దరఖాస్తు చేసుకున్నాడు. కానీ ఈయన పేరు మీద ఉన్న భూమి రిజిస్ట్రేషన్ రద్దు అయినట్టు తేలింది. ఒకసారి రిజిస్ట్రేషన్ అయిన దాన్ని రద్దు చేయాలంటే అమ్మిన వారు, కొన్న వారు ఇద్దరూ సమ్మతితోనే చేయాలి. కానీ ఎవరో మూడో వ్యక్తి వెళ్లి సంతకాలు చేయగా రిజిస్ట్రేషన్‌ను రద్దు చేశారు. దీంతో ఆదినారాయణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు అయింది. దీనిపై దర్యాప్తు చేయగా సదరు రిజిస్ట్రేషన్ రద్దు పూర్తిగా అక్రమమని, దీని వెనుక భారీగా ముడుపులు తీసుకున్నట్టు ఉన్నతాధికారులు గుర్తించారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపిన అనంతరం సబ్ రిజిస్ట్రార్ రామ్మోహన్‌ను సస్పెండ్ చేస్తూ రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో నెల రోజుల వ్యవధిలో జిల్లాలో ముగ్గురు సబ్ రిజిస్ట్రార్‌లు సస్పెండ్ అయిపోయారు. అనంతపురం అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అవినీతిపై ప్రస్తుతం ఏసీబీ విచారణ జరుగుతున్న విషయం తెలిసిందే.

19 నుంచి గూగూడు బ్రహ్మోత్సవాలు

- అధికారులు సమన్వయంతో జయప్రదం చేయాలి
- ఏర్పాట్లపై సమీక్షలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

అనంతపురం రూరల్: మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 19 నుంచి ప్రారంభం కానున్నాయి. 31 వరకు సాగే బ్రహ్మోత్సవాలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి జయప్రదం చేయాలని శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి కోరారు. బుధవారం అనంతపురంలోని డ్వామా హాలులో ఆర్డీఓ మధుసూదన్ అధ్యక్షతన బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే పద్మావతి మాట్లాడుతూ గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలకు కుల, మతాలకు అతీతంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారన్నారు. 26వ తేదీన చిన్న సరిగెత్తు, 28న పెద్ద సరిగెత్తు ఉంటుందన్నారు. పారిశుధ్య సమస్య లేకుండా చూసుకోవాలన్నారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా వీలైనన్ని బస్సులు తిప్పడానికి ఆర్టీసీ అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా అగ్నిమాపక సిబ్బంది వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. వైద్య సిబ్బంది మందులు అందుబాటులో ఉంచుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

గట్టి బందోబస్తు..

నార్పల: గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలకు గట్టి బందోబస్తు నిర్వహించనున్నట్లు ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన గూగూడు గ్రామాన్ని సందర్శించారు. బ్రహ్మోత్సవాల్లో అల్లర్లు, గొడవలు జరగకుండా చూసుకోవాలని పోలీసు సిబ్బందికి సూచించారు. అగ్ని గుండం చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటశివారెడ్డి, సీఐ అస్రార్ బాషా, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





క్లుప్తంగా

జగన్‌తోనే బీసీలకు గుర్తింపు

- ఎమ్మెల్సీ మంగమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

అనంతపురం క్రైం: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే బీసీలకు గుర్తింపు వచ్చిందని ఎమ్మెల్సీ మంగమ్మ అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించిన సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ.. మంత్రి, ఎమ్మెల్యే, నాలుగు రాజ్యసభ సీట్లు, జెడ్పీ చైర్మన్, మేయర్, డిప్యూటీ మేయర్లు, నామినేటెడ్ పదవులకు అవకాశం కల్పించి బీసీల తలరాతను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్చారన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చేసుకునేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్ మాట్లాడుతూ బీసీలు బ్యాక్‌వర్డ్ కాదని, బ్యాక్ బోన్ అని భావించి, సామాజిక న్యాయం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటామన్నారు. వైఎస్సార్‌సీపీ నేత డాక్టర్ పోతుల నాగరాజు మాట్లాడుతూ.. టీడీపీ అధినేత చంద్రబాబు మోసాలకు కేరాఫ్‌గా నిలిస్తే.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు 65 శాతం పదవులు కేటాయించి విజన్ కలిగిన గొప్ప నాయకుడిగా ఎదిగారన్నారు. బడుగు, బలహీనవర్గాలభ్యున్నతికి సుదీర్ఘ పోరాటాలు చేస్తున్న తాను సీఎం వైఎస్ జగన్ రెడ్డి తీసుకువచ్చిన సంక్షేమ విప్లవం పట్ల ఆకర్షితుడినై పార్టీలో చేరినట్లు గుర్తు చేశారు. అనంతరం డాక్టర్ పోతుల నాగరాజును ఎమ్మెల్సీ మంగమ్మ, పార్టీ అధ్యక్షుడు పైలా నరసింహయ్య, బీసీ కమిషన్ సభ్యులు కిష్టప్ప తదితరులు సన్మానించారు. డీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత, రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జ్ బోయ నరేంద్ర బాబు, నాయకులు ధనుంజయ యాదవ్, నిమ్మల నాగరాజు, లింగాల రమేష్, కార్పొరేటర్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ 'విద్యుత్ ఎస్ఈ'

అనంతపురం టౌన్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి గురువారం ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకూ డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ శాఖ ఎస్ఈ సురేంద్ర బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటున్న వినియోగదారులు నేరుగా 08554–272943 నంబర్‌కు ఫోన్ చేసి సమస్య వివరిస్తే పరిష్కార చర్యలను చేపట్టనున్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ కోరారు.

ఆకుపచ్చని జీవితాలు



ఈమె పేరు శివలక్ష్మి. బుక్కరాయసముద్రం మండలం అమ్మవారిపేట. భర్త పోతులయ్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పిల్లలను చదివిస్తున్నారు. సొంత భూమి లేకపోవడంతో ఓ వ్యక్తితో 25 సెంట్ల పొలాన్ని కౌలుకు తీసుకున్నారు. ఆకు కూరలు సాగు చేస్తూ రోజూ రూ.వెయ్యి నుంచి రూ.1,200 ఆదాయం పొందుతున్నారు.

- ఆకుకూరల సాగులో రాణిస్తున్న రేకులకుంట, పరిసర గ్రామాల రైతులు
- సెంటు భూమిలోనూ పంట సాగు
- తక్కువ పెట్టుబడితో మంచి ఆదాయం

సాక్షి, అనంతపురం డెస్క్:
రేకులకుంట.. ఈ పేరు ఉమ్మడి జిల్లా రైతులకు చిరపరిచితమే. ఇక్కడి వ్యవసాయ పరిశోధన స్థానం (ఏఆర్‌ఎస్) రాష్ట్రంలోనే ప్రసిద్ధి గాంచింది. వివిధ పంటలకు సంబంధించిన పరిశోధనల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తోంది. వ్యవసాయ పరిశోధనలకు పేరుగాంచిన రేకులకుంట.. మరో గుర్తింపునూ సొంతం చేసుకుంది. ఆకుకూరల సాగుకు కేరాఫ్‌గా మారింది. గ్రామంలో మెజార్టీ రైతులు ఎంతోకొంత విస్తీర్ణంలో ఆకుకూరలు పండిస్తూ ఏడాది పొడవునా ఆదాయం పొందుతున్నారు.

ఫలితమిచ్చిన ప్రత్యామ్నాయం..

బుక్కరాయసముద్రం మండల పరిధిలోని రేకులకుంట గ్రామం అనంతపురం నగరానికి కేవలం ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. దాదాపు 300 కుటుంబాలు ఇక్కడ నివసిస్తున్నాయి. అందరూ వ్యవసాయంపైనే ఆధారపడ్డారు. గతంలో వేరుశనగ, వరి ఎక్కువగా సాగుచేసేవారు. ముఖ్యంగా వేరుశనగలో వరుస పంట నష్టాలు రావడంతో ప్రత్యామ్నాయంపై దృష్టి సారించారు. ఈ క్రమంలో వారిని ఆకుకూరల సాగు ఆదుకుంది.



ఆకుకూరలు తొలగిస్తున్న మహిళలు

సెంటు విస్తీర్ణంలోనూ...

రేకులకుంట గ్రామ పరిసరాల్లో ఎటుచూసినా ఆకుకూరల పంటలు కన్పిస్తాయి. ఒక్కొక్క రైతు తమ స్థాయిని బట్టి రెండెకరాలు మొదలుకుని సెంటు విస్తీర్ణంలోనూ ఆకుకూరలు సాగు చేస్తున్నారు. ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లోనూ పంట వేస్తున్నారు. మలక్కూర, తోటకూర, మెంతాకు, గోంగూర, చుక్కాకు, పలకలాకు, కొత్తిమీర, కరివేపాకు తదితర ఆకుకూరలను పండిస్తున్నారు. గ్రామంలో 50 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో కేవలం ఆకుకూరలే సాగు చేస్తుండడం విశేషం. రేకులకుంటతో పాటు సమీపంలోని దయ్యాలకుంటపల్లి, అమ్మవారిపేట గ్రామాల్లోనూ పలువురు రైతులు ఆకుకూరల సాగు ద్వారా మంచి ఆదాయం పొందుతున్నారు.

నిలకడగా ఆదాయం..

ఆకుకూరల సాగుకు పెట్టుబడి తక్కువ. ఎకరా విస్తీర్ణంలో పంట వేసేందుకు రూ.10 వేల వరకు ఖర్చు వస్తుంది. పంట చేతికొచ్చిన తర్వాత రూ.50 వేలకు పైగానే ఆదాయం లభిస్తుంది. రైతులు తమ పొలాలను చిన్నచిన్న భాగాలుగా విభజించుకుని రకరకాల ఆకుకూరలు పండిస్తున్నారు. ఒకవైపు పంటకోత పూర్తయ్యేలోగా.. మరోవైపు కోతకు సిద్ధమవుతోంది. ఇలా ఏడాది పొడవునా దిగుబడి లభిస్తోంది. రోజూ ఏదోఒక ఆకుకూరను మార్కెట్టుకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ఇలా రోజూ రైతుల చేతికి డబ్బు వచ్చి చేరుతోంది. అంతేగాక రైతు కుటుంబాల్లోని వ్యక్తులు బయటి పనులకు వెళ్లే అవసరమే లేదు. నిత్యమూ వారి పొలాల్లోనే చేతినిండా పని ఉంటోంది.



మార్కెట్‌కు తరలించేందుకు వాహనంలో సిద్ధంగా ఉన్న ఆకుకూరలు

నగరంలో విక్రయం..

రేకులకుంట పరిసర గ్రామాల రైతులు పండిస్తున్న ఆకుకూరలను ఎక్కువగా అనంతపురం నగరానికి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. కొందరు నగరంలోని కూరగాయల వ్యాపారులకు హోల్‌సేల్‌గా అమ్ముతుండగా..మరికొందరు సొంతంగా విక్రయిస్తున్నారు. ఇక్కడ పండిస్తున్న ఆకుకూరలు అనంతపురం నగరంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలకూ ఎగుమతి అవుతున్నాయి.

నిరంతరం ఆదాయమే



వరి, వేరుశనగ పంట దిగుబడులు రావాలంటే 3 నుంచి 5 నెలల వరకు వేచిచూడాలి. ఆ తరువాత కూడా పంట చేతికొస్తుందో, లేదో తెలీదు. అదే ఆకు కూరలు సాగు చేస్తే 15–30 రోజులకే ఆదాయం పొందవచ్చు. తక్కువ పెట్టుబడితో మంచి ఆదాయం తీసుకోవచ్చు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన పెరిగింది. ఆకుకూరలు ఎక్కువగా తీసుకుంటున్నారు. దీనివల్ల మార్కెట్‌లో కూడా మంచి డిమాండ్ ఉంటోంది.

– వీరాంజినేయులు, రేకులకుంట

రోజూ పని దొరుకుతోంది..



రేకులకుంట పరిసర గ్రామాల్లో ఆకుకూరలు ఎక్కువగా పండిస్తున్నారు. దీనివల్ల నాలాంటి కూలీలకు రోజూ పొలం పనులు దొరుకుతున్నాయి. రూ.200 రోజు కూలి ఇస్తున్నారు. పని కూడా సులభమే.

– లక్ష్మిదేవి, అమ్మవారిపేట

పదేళ్లుగా పండిస్తున్నా..



పదేళ్లుగా ఆకుకూరలు పండిస్తున్నా. అనంతపురం దగ్గరగా ఉండడంతో విక్రయం కూడా సులభమే. మిగిలిన పంటల కంటే ఆకుకూరలు ఎంతో మేలు. ఖర్చు తక్కువ..ఆదాయం ఎక్కువ. చీనీ చెట్ల మధ్యలోని అరఎకరా పొలంలో ఎప్పుడూ ఆకుకూరలే వేస్తాం.

– సాకే లక్ష్మి నారాయణ, రేకులకుంట

ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలి

గార్లదిన్నె: ప్రజలతో స్నేహ పూర్వకంగా మెలగాలని సిబ్బందిని డీఐజీ అమ్మిరెడ్డి ఆదేశించారు. బుధవారం రాత్రి గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు. జాతీయ రహదారిపై బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి, ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగ కుండా గ్రామాల్లో పోలీసులు పర్యటించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సాగర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. కాగా, అంతకు ముందు మధ్నాహ్నం అడిషనల్ ఎస్పీ విజయభాస్కరరెడ్డి తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డీఐజీ అమ్మిరెడ్డి

కౌలు రైతులకు సాగు హక్కు పత్రం

- డీఏఓ ఉమామహేశ్వరమ్మ

రాయదుర్గం రూరల్/గుమ్మఘట్ట: జిల్లా వ్యాప్తంగా కౌలు రైతులను గుర్తించి వారికి సాగు హక్కు పత్రాలు అందజేస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ తెలిపారు. రాయదుర్గం మండలం ఆవులదట్ల, 74 ఉడేగోళంతో పాటు స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను, గుమ్మఘట్ట మండలం బేలోడు ఆర్‌బీకేను బుధవారం ఆమె తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఆర్బీకే సేవలపై అక్కడున్న రైతులతో ఆరా తీశారు. రైతులతో మాట్లాడుతూ.. ప్రతి రైతూ ఈకేవైసీ తప్పని సరిగా చేయించుకోవాలని సూచించారు. సాగుహక్కు పత్రం కలిగిన కౌలు రైతులకు రైతు భరోసా కింద వారి బ్యాంక్ ఖాతాల్లోకి రూ.13,500ని ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. అవసరమైన విత్తనాలు, ఎరువులు, బ్యాంకు రుణం పొందేందుకు సాగు హక్కు పత్రం ఉపయోగపడుతుందన్నారు. పంట పెరిగిన తరువాత ప్రతి రైతు సాగు చేసిన పంటలను ఈ క్రాప్ బుకింగ్ చేయాలని ఆర్బీకే సిబ్బందిని ఆదేశించారు. చిరు ధాన్యాల సాగును ప్రోత్సహించాలన్నారు. ఏడీఏ లక్ష్మానాయక్, ఏఓలు నిర్మల్‌కుమార్, మహేంద్ర పాల్గొన్నారు.

ఇది ప్రజల ప్రభుత్వం

- స్వర్ణయుగాన్ని తలపిస్తున్న సీఎం జగన్ పాలన
- పామిడి పెన్నా కాజ్‌వే ప్రారంభోత్సవంలో ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే వైవీఆర్

పామిడి: రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కొనసాగుతోందని అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి అన్నారు. సంక్షేమమే ఊపిరిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగిస్తున్న పాలన స్వర్ణ యుగాన్ని తలపిస్తోందన్నారు. రూ.3.15 కోట్ల నిధులతో ఆధునీకరణ చేసిన పెన్నా కాజ్‌వేను బుధవారం వారు ప్రారంభించి, మాట్లాడారు. గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని సచివాలయాల వ్యవస్థ ద్వారా నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దన్నారు. వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలను అందజేస్తున్నారన్నారు. కరోనా కష్టం కాలంలోనూ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా వలంటీర్లు అందించిన సేవలు మరువలేనివన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా ఉంటూ నిస్వార్థ సేవలు అందిస్తున్న వలంటీర్ల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కు ప్రజలే బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో అధికార దాహంతో మాజీ సీఎం చంద్రబాబు మోసపూరిత హామీలను ప్రకటిస్తున్నారని, వీటిని ప్రజలెవ్వరూ నమ్మడం లేదన్నారు. ఏమాత్రం రాజకీయ పరిణితి లేని నారాలోకేష్ పాదయాత్ర పస లేకుండా సాగుతోందన్నారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేను ఫర్టిలైజర్స్, క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్, వ్యాపారస్తులు, స్వర్ణకారుల సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ కే నారాయణరెడ్డి, నాయకులు జానకీరామిరెడ్డి, ఎల్ మధుసూదన్‌రెడ్డి, పెమ్మక చెన్నకేశవరెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దత్తు, సచివాలయాల పట్టణ, రూరల్ కన్వీనర్లు ఆసిఫ్, కుమార్‌రెడ్డి, సీనియర్ నాయకుడు అనిమిరెడ్డి, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు మూలి నాగేశ్వరరెడ్డి, జోయిజోడే కుమార్, రాజశేఖర్, ఎంహెచ్ అనిల్‌కుమార్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, శ్రీనివాసరావు, వెంకటేష్, రంగనాయకులు, అధికారులు పాల్గొన్నారు.



పామిడి పెన్నా కాజ్‌వేను ప్రారంభిస్తున్న ఎంపీ తలారి రంగయ్య, గుంతకల్లు ఎమ్మెల్యే వైవీఆర్

'వాత్సల్య' అక్రమాలపై విచారణ

అనంతపురం సెంట్రల్: అభ్యాగులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ వాత్సల్య పథకంలో చోటు చేసుకున్న అక్రమాలపై బుధవారం ఉన్నత స్థాయి విచారణ కొనసాగింది. తల్లిదండ్రులు కోల్పోయినా, ఇద్దరిలో ఒకరు లేకపోయినా, నిరాదరణకు గురైన 18 ఏళ్ల లోపు వారి సంక్షేమానికి ప్రతి నెలా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తోంది. ఐసీడీఎస్ పర్యవేక్షణలో అమలవుతున్న ఈ పథకంలో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఓ అధికారితో పాటు బిల్లులు సక్రమంగా చేయడం లేదంటూ కాంట్రాక్ట్ సిబ్బంది వేర్వేరుగా ఆ శాఖ ఆర్జేడీ, డైరెక్టరేట్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఆర్జేడీ పద్మజ బుధవారం అనంతపురానికి చేరుకుని ఐసీడీఎస్‌లో ఏం జరుగుతోందనే అంశంపై ఆరా తీశారు. పలు రికార్డులు తనిఖీ చేశారు. జిల్లాలోని సీడీపీఓలతో సమీక్షించారు. ఇటీవల ఐసీడీఎస్ కార్యక్రమాల అమలులో అనంతపురం జిల్లా వెనుకబడడంపై అసహనం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ భవన నిర్మాణాలు నత్తనడకన సాగుతుండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అసలు ఉద్యోగులు పని చేస్తున్నారా? లేదా? అంటూ మండిపడ్డారు. దాదాపు గంటల పాటు జరిగిన విచారణలో ఎక్కడేగాని తమ అవినీతి బయటపడకుండా జిల్లా అధికారులు జాగ్రత్త తీసుకోవడంతో విచారణ కాస్త ఎటూ తేలని వ్యవహారంగా మారింది. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి, జిల్లాలోని అన్ని ప్రాజెక్టుల సీడీపీఓలు, ఏసీడీపీఓలు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు

అనంతపురం అగ్రికల్చర్: ప్రధానమంత్రి కౌశల్ కేంద్రం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణతో పాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన సర్టిఫికెట్లు, ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఈ మేరకు ఆ కేంద్రం మేనేజర్ బి.శ్రీకాంత్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, రిటైల్ సేల్స్ అసోసియేట్ అంశాలపై 55 రోజుల పాటు ఉచిత శిక్షణ ఉంటుంది. వీటితో పాటు కంప్యూటర్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ టిప్స్‌పై శిక్షణ ఇస్తారు. పదో తరగతి పాస్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ ఫెయిల్ అయి, 18 నుంచి 32 సంవత్సరాల్లోపు ఉన్న వారు అర్హులు. పూర్తి వివరాలకు అనంతపురం శివారులోని చిన్మయనగర్‌లో ఉన్న కౌశల్ కేంద్రాన్ని (70321 34767, 81257 46282) సంప్రదించవచ్చు.

రూడ్‌సెట్ ఆధ్వర్యంలో మహిళలకు శిక్షణ

అనంతపురం: ఉమ్మడి జిల్లాకు చెందిన నిరుద్యోగ మహిళలకు రూడ్‌సెట్ ఆధ్వర్యంలో బ్యూటీ పార్లర్, కంప్యూటర్ ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఆ సంస్థ డైరెక్టర్ ఎస్.విజయలక్ష్మి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆగస్టు 2 నుంచి 30 రోజుల పాటు శిక్షణ ఉంటుంది. ఉచిత శిక్షణతో పాటు వసతి, భోజన సదుపాయం కల్పిస్తారు. కంప్యూటర్ ట్యాలీ శిక్షణకు ఇంటర్మీడియట్‌లో సీఈసీ, బీకాం పూర్తి చేసిన వారు, బ్యూటీపార్లర్ శిక్షణకు పదో తరగతి ఫెయిల్ లేదా పాస్ అయిన వారు అర్హులు. పూర్తి వివరాలకు 94409 05479, 96188 76060, 08554–255925లో సంప్రదించవచ్చు.

వెనుకబడిన ప్రాంతాల పురోగతికి కేరళ విధానం మేలు

- సీపీఎం కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు మరియం అలెగ్జాండర్ బేబీ

అనంతపురం: ప్రజల భాగస్వామ్యంతో క్షేత్రస్థాయి నుంచి ప్రణాళికలు రూపొందించి అమలు చేయడంతోనే కేరళలో వెనుకబడిన ప్రాంతాల పురోగతి సాధ్యమైందని ఆ రాష్ట్రానికి చెందిన సీపీఎం కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు మరియం అలెగ్జాండర్ బేబి (ఎంఏ బేబీ) అన్నారు. 'వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి – కేరళ ప్రభుత్వ నమూనా' అంశంపై జిల్లా పరిషత్ కార్యాలయంలోని డీపీసీ సమావేశ మందిరంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేరళలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రత్యామ్నాయ విధానాలను వివరించారు. భారతదేశంలో పరిమితులకు లోబడి ప్రత్యామ్నాయ విధానాలు అవలంబించడం ద్వారా ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు. పునఃపంపిణీ వ్యవస్థతో ప్రజలకు అవసరమైన చర్యలను కేరళ ప్రభుత్వం చేపడుతోందన్నారు. అందుకే దేశంలో ఎక్కడా లేని విధంగా కేరళలో కార్మికుల వేతనాలు ఎక్కువగా ఉంటున్నాయన్నారు. కేరళలో 85 లక్షల కుటుంబాలు ఉంటే 65 లక్షల కుటుంబాలకు సామాజిక ఫించన్ అందుతోందన్నారు. పంచాయతీ పరిధిలోనే ఆ గ్రామానికి ఏమి కావాలో నిర్ణయించి పంపిస్తారన్నారు. అందుకు అనుగుణంగానే నిధుల కేటాయింపు ఉంటుందన్నారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చాక ప్రణాళికా సంఘమే లేకుండా పోయిందన్నారు. ఒక్క కేరళలో మాత్రమే ప్రణాళికా మండళ్లు ఇప్పటికీ పని చేస్తున్నాయన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో 35 నుంచి 40 శాతం వరకు స్థానిక సంస్థలకే నేరుగా నిధులు కేటాయిస్తారన్నారు. కేరళలో కొత్తగా ఏడు లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారన్నారు. ఆంగ్ల విద్య కోసం ప్రత్యేకంగా 6 వేల మంది ఉపాధ్యాయులను భర్తీ చేయడం జరిగిందన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేరళ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు మేలన్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఓ.నల్లప్ప అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బాలరంగయ్య, సావిత్ర, నగర కార్యదర్శి వి. రామిరెడ్డి, మానవ హక్కుల వేదిక నాయకులు చంద్రశేఖర్, ఎస్ఎం. బాషా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఏ బేబీ

అజ్ఞాతంలోనూ వైభోగమే

- పోలీసులకు దొరకని ఆర్ఐ విష్ణుతేజ్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అసాంఘిక శక్తులతో జతకట్టి భూ రికార్డులు తారుమారుచేసి ఒకరి ఆత్మహత్యకు కారకుడైన కేసులో నిందితుడిగా ఉన్న అనంతపురం రూరల్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విష్ణుతేజ్ పోలీసులకు దొరక్కుండా ముప్పతిప్పలు పెడుతున్నాడు. కుటుంబంతో సహా పొరుగు రాష్ట్రంలో తలదాచుకుంటున్న అతడి కోసం వెళితే.. పాత నేరస్తుడైన అతని బావ తారసపడ్డాడు. అయితే అతడిని అదుపులోకి తీసుకోకుండా ఒత్తిళ్లు రావడంతో పోలీసులు తదుపరి చర్యలు తీసుకోలేకపోయారు. అనంతపురంలో ప్రింటింగ్ ప్రెస్ యజమాని తుమ్మల వంశీ భార్య పేరిట కురుగుంట వద్ద ఉన్న భూమిని ముగ్గురు రౌడీషీటర్లు కబ్జా చేశారు. న్యాయం కోసం వెళితే ఆర్ఐ విష్ణుతేజ్ కబ్జాదారుల పక్షాన నిలిచి దురుసుగా వ్యవహరించాడు. రౌడీషీటర్ల నుంచి బెదిరింపులు, ఒత్తిడి పెరగడంతో వంశీ నెల కిందట ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. తన చావుకు కారణం రౌడీషీటర్లతో పాటు ఆర్ఐ విష్ణుతేజ్ పేరును సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి, ముగ్గురు రౌడీషీటర్లను కటకటాల్లోకి నెట్టారు. అప్రమత్తమైన ఆర్ఐ విష్ణుతేజ్ పోలీసుల కళ్లుగప్పి తమిళనాడులో ఉంటున్న అక్క, బావ వద్దకు మకాం మార్చాడు. అనంతపురం నుంచి వెళ్లేటపుడు వ్యభిచారం నిర్వహించే మహిళను వెంటబెట్టుకెళ్లినట్లు సమాచారం. కుటుంబానికి దూరంగా సదరు మహిళతో విష్ణుతేజ్ ఉంటున్నట్లు తెలుసుకున్న పోలీసులు రెండు రోజుల క్రితం తమిళనాడుకు వెళ్లారు. అయితే అక్కడ విష్ణుతేజ్ దొరకలేదు. అతని బావ తారసపడ్డాడు. ఎవరని ఆరా తీస్తే.. ఇతను ఎల్ఐసీలో ఉద్యోగాలిప్పిస్తానంటూ అమాయకుల నుంచి రూ.60 లక్షలకు పైగా వసూలు చేసుకుని ఉడాయించిన వ్యక్తిగా తేలింది. ఇతనిపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో వారెంట్లు పెండింగ్ ఉన్నాయని నిర్ధారించుకున్న పోలీసులు అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తే ఓ 'పెద్ద మనిషి' నుంచి ఒత్తిడి రావడంతో అడుగు ముందుకేయలేకపోయారు. చేసేదిలేక తమిళనాడులోని ఓ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి నోటీసు ఇచ్చి వెనుదిరగాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా.. విష్ణుతేజ్ ముందస్తు బెయిల్‌కు దరఖాస్తు చేసుకోగా.. న్యాయస్థానం మంజూరు చేయలేదు.

ప్రకృతి వ్యవసాయంపై విదేశీ ప్రతినిధుల అధ్యయనం



ఘన జీవామృతం తయారీని ఆసక్తిగా తిలకిస్తున్న విదేశీయులు

కళ్యాణదుర్గం: ప్రకృతి వ్యవసాయ విధానాలను విదేశీ బృందం సభ్యులు పరిశీలించారు. కళ్యాణదుర్గం మండలం పాలవాయి, మల్లాపురం గ్రామాల్లో బుధవారం ఫ్రాన్స్‌కు చెందిన పలువురు పర్యటించి, క్షేత్ర స్థాయిలో ప్రకృతి వ్యవసాయ విధానాలను అధ్యయనం చేశారు. మల్లాపురంలో రైతు మల్లికార్జున, నారాయణప్పకు చెందిన పొలాల్లో సాగు చేస్తున్న కాయగూరలు, ఏటీఎం మోడల్‌ను, పాలవాయిలో రైతు చక్రధర్ సాగు చేస్తున్న ఏటీఎం మోడల్‌ను పరిశీలించారు. రైతులు స్వయంగా తయారు చేసుకుంటున్న ఘన, ద్రవ జీవామృతాలు, బీజా మృతం, విత్తనోత్పత్తి వంటి వాటిని ఆసక్తిగా గమనించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధిస్తున్నట్లు రైతులు వివరించారు. ఎలాంటి చీడపీడలు లేని పంట ఉత్పత్తులు సాధిస్తున్నట్లు తెలిపారు. ఏటీఎం మోడల్ వల్ల రోజూ ఏదో ఒక రకం కాయగూరలు చేతికందుతున్నాయని, ఈ సందర్భంగా విదేశీ ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం చాలా బాగుందంటూ కితాబునిచ్చారు. కార్యక్రమంలో ఫ్రాన్స్ బృందం సభ్యులు హికెమ్ ఎస్సామ్‌కొవాయి, మాటిస్ జాంబాన్, లూయిస్ రాబినెట్, రైడ్‌కయిట్, ఫెరా సఫావత్, రాష్ట్ర సభ్యులు నాగిరెడ్డి, వై.శాస్త్రి, జిల్లా కోఆర్డినేటర్ భానుమతి, ఎన్ఎఫ్ఎంటీ శివశంకర్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

12వ పీఆర్సీ ఏర్పాటుపై వైఎస్సార్‌టీఎఫ్ హర్షం

రాప్తాడు రూరల్: ఏపీ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల మేలుకోరి 12వ పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ)ను ఏర్పాటు చేయడంపై వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి కె.ఓబుళపతి హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

క్లుప్తంగా

పరామర్శ



చక్రపాణి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చక్రపాణి (45) అనారోగ్యంతో బుధవారం మరణించాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. చక్రపాణి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధైర్యపడకండి.. అండగా ఉంటామంటూ భరోసా ఇచ్చారు.

విద్యార్థులకు వ్యాయామం తప్పనిసరి

ఆత్మకూరు: వికలత్వం ఉన్న విద్యార్థులతో వ్యాయామం తప్పనిసరిగా చేయించాలని ఎంఈఓలు నరసింహారెడ్డి, రామాంజినేయులు తల్లిదండ్రులకు సూచించారు. బుధవారం స్థానిక భవిత కేంద్రంలో విద్యార్థులకు ఫిజియోథెరపీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులతో వ్యాయామం, యోగా తప్పనిసరిగా చేయించాలన్నారు. ఇలా చేయడం వల్ల పిల్లల నరాల్లో కదలికలు వచ్చి మెరుగుపడే అవకాశం ఉందని తెలియజేశారు. ఫిజియోథెరపీతో పాటు బొమ్మలు, ఆటలతో విద్యాబోధనపై వివరించారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ అరుణకుమారి పాల్గొన్నారు.

ఏపీ ఈఏపీసెట్ వెబ్ కౌన్సెలింగ్‌పై అవగాహన



సూచనలిస్తున్న ఆర్డీటీ ఎడ్యుకేషన్ విభాగం సిబ్బంది

అనంతపురం: త్వరలో నిర్వహించనున్న ఏపీ ఈఏపీసెట్ వెబ్ కౌన్సెలింగ్‌పై ఆర్డీటీలో ప్రత్యేక సాయం కింద ఇంటర్మీడియట్ వరకూ చదువుకున్న విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఆర్డీటీ కార్యాలయంలోని ఆడిటోరియంలో ఆర్డీటీ ఎడ్యుకేషన్ సిబ్బంది కళాశాల ఎంపిక, వెబ్ ఆప్షన్ ఎలా ఇవ్వాలి? బ్రాంచ్‌ల ఎంపిక తదితర అంశాలపై వివరించారు. కాగా.. ఆర్డీటీ స్పెషల్ నీడ్ కింద కార్పొరేట్ పాఠశాల, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఏపీఈఏపీసెట్‌లో మంచి ర్యాంకులు దక్కాయి. వీరిలో సింహభాగం ఉత్తమ ఇంజినీరింగ్ కళాశాలల్లోనే సీట్లు దక్కనున్నాయి.

విల్ గ్రీన్‌వుడ్ సెంచరీ



అనంతపురం: హట్ హాక్స్ న్యూజిలాండ్, డీటీడీసీ మధ్య జరుగుతున్న డీటీడీసీ సిల్వర్ జూబ్లీ కప్–2023లో భాగంగా బుధవారం వన్డే మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన హట్ హాక్స్ 46 ఓవర్లలో 283 పరుగులకు ఆలౌట్ అయింది. విల్ గ్రీన్ వుడ్ 103 బంతుల్లో 113 పరుగులు (8 ఫోర్లు, 5 సిక్సర్లు) చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన డీటీడీసీ 38 ఓవర్లలోనే 262 పరుగులకు ఆలౌట్ అయింది. హట్ హాక్స్ న్యూజిలాండ్ విజయం సాధించింది. సృజిత్ 52 బంతుల్లో 72 పరుగులు (5 ఫోర్లు, 2 సిక్సర్లు), మోహిత్ బీఏ 51 బంతుల్లో 62 పరుగులు కీలకమైన భాగస్వామ్యం నెలకొల్పినప్పటికీ, వరుసగా వికెట్లు పడటంతో ఓడిపోయింది.

రోటరీ సేవలు విస్తృతం కావాలి



మాట్లాడుతున్న రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ చిన్నపురెడ్డి

అనంతపురం కల్చరల్: సమాజ సేవే ప్రధాన లక్ష్యంగా అందరిలో స్ఫూర్తి నింపుతూ రోటరీ సేవలను విస్తృతం చేయాలని రోటరీ క్లబ్ ప్రతినిధులు సూచించారు. స్థానిక కమలానగర్‌లోని రోటరీక్లబ్ ప్రాంగణంలో బుధవారం రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ అనంతపురం అధ్యక్షుడిగా కేసీ రామమూర్తి, సెక్రటరీగా విజయభాస్కర్, జాయింట్ సెక్రటరీగా శ్రీధర్ స్వామి, రోటరీ క్లబ్ ఆఫ్ సెంట్రల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా భవానీ రవికుమార్, గల్లా హర్ష ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన క్లబ్ పూర్వపు గవర్నర్లు శేషాంజనేయులు, చిన్నపురెడ్డి, సహాయ గవర్నర్ తిమ్మారెడ్డి నూతనంగా ఎంపికైన వారితో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. రోటరీ క్లబ్ అనేక సేవా కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తోందన్నారు. వాటిని కొనసాగించడానికి నూతన కార్యవర్గాలు శ్రద్ధ తీసుకుంటాయన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు శ్రీమన్నారాయణ, అప్పాసుధీర్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం

హ్యాట్సాఫ్.. పోతలయ్య



కరోనా సమయంలో కూరగాయలు అందజేస్తున్న వలంటీర్ పోతలయ్య (ఫైల్)

ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు పోతలయ్య. కనగానపల్లి మండల కేంద్రంలోని బీసీ కాలనీలో వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కరోనా విజృంభించిన సమయంలో తన ప్రాణాలు లెక్క చేయకుండా సేవలందించాడు. ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలు తెలుసుకుని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. కరోనా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాడు. అలాగే దాతలు అందించిన శానిటైజర్లు, మాస్కులు పంపిణీ చేశాడు. కరోనా సోకి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుల వద్దకు వెళ్లి పింఛన్ డబ్బులు అందజేసి, మానవత్వం చాటుకున్నాడు. ఇతని సేవలకు మెచ్చి అప్పటి జిల్లా కలెక్టర్ గంధం చంద్రుడు 'యోధులకు వందనం' కింద ప్రశంసా పత్రాన్ని అందజేశారు. – కనగానపల్లి:

ప్రాణాలకు తెగించి సేవ చేశాడు..



కరోనా సమయంలో ఇంటి నుంచి బయలకు వెళ్లాలంటే భయంగా ఉండేది. అటువంటి సమయంలో మా గ్రామ వలంటీర్ పోతలయ్య మా ఇళ్ల వద్దకే వచ్చి పింఛన్ అందజేయడం సంతోషకరం. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఇచ్చిన కూరగాయలు, పండ్లు, శానిటైజర్లను ఇంటింటికీ తిరిగి అందజేశాడు. వలంటీర్ ప్రాణాలకు తెగించి మాకు సేవలు చేయటం చాలా గొప్ప విషయం.

– పెదన్న, బీసీ కాలనీ, కనగానపల్లి

ప్రాణాలొడ్డి.. సేవలందించి



ఆశా కార్యకర్తతో కలిసి మందులు పంపిణీ చేస్తున్న వలంటీర్ వై.హేమావతి (ఫైల్)

ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు వై.హేమావతి రాప్తాడు మండలంలోని రామినేపల్లిలో వలంటీర్‌గా పని చేస్తోంది. కరోనా విపత్తులో ప్రాణాలకు ఎదురొడ్డి ప్రజలకు సేవలందించింది. క్షేత్రస్థాయి సిబ్బందితో కలిసి రెడ్ జోన్లలో కరోనా బాధితులకు సహాయ సహకారాలు అందించడంలో ముందు వరసలో నిలిచింది. పాజిటివ్ కేసులు నమోదైన వీధుల్లోకి వెళ్లి బ్లీచింగ్ చల్లడం, వారు ఇంటి నుంచి బయటకు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంది. తన పరిధిలోని ప్రజల ఆరోగ్య సమాచారాన్ని సేకరించి అధికారులకు చేరవేస్తూ వచ్చింది. అలాగే స్థానిక ఆశాకార్యకర్త రామాంజినమ్మతో కలిసి కరోనా బాధితులకు మందులు పంపిణీ చేసింది. – రాప్తాడు:

వలంటీర్ల సేవలు అమూల్యం



తెల్లవారుజామున 5 గంటలకే తలుపు తట్టి వలంటీర్ హేమావతి పింఛన్ అందజేస్తోంది. గత ప్రభుత్వంలో పింఛన్ తీసుకోవాలంటే చాలా ఇబ్బంది పడ్డాం. ఒక్కోసారి నాలుగైదు రోజులు గడిచినా పింఛన్ అందేది కాదు. ప్రస్తుత ప్రభుత్వంలో వలంటీర్లు 1వ తేదీనే ఇంటి దగ్గరకే వచ్చి పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తున్నారు. ఇక కరోనా సమయంలో వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి. హేమావతి సరుకులు ఇంటికి తెచ్చి ఇచ్చేది. మాకు ఏమీ పని ఉన్నా హేమావతి చేస్తుంది. ప్రాణాలకు తెగించి సేవలందించింది. సీఎం జగన్ ప్రవేశపెట్టిన వలంటర్, సచివాలయ వ్యవస్థ బాగుంది. ఇంటి వద్దకే సేవలు అందుతున్నాయి.

– చింతపంటి లక్ష్మీదేవి

వరదల్లో కుటుంబానికి అండగా..



వరద నీటిలో చిక్కుకున్న అంకమ్మను సురక్షితంగా బయటకు తీసుకొస్తున్న వలంటీర్ రాజేశ్వరి (ఫైల్)

ఈ ఫొటోను చూడండి. గతేడాది అక్టోబర్‌లో జిల్లాలో పెద్ద ఎత్తున వర్షాలు వచ్చాయి. నడిమివంక పొంగిపొర్లింది. యువజన కాలనీ, హనుమాన్ కాలనీ, గౌరవగార్డెన్, రజక్ నగర్, తదితర ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. గౌరవగార్డెన్ ప్రాంతంలో వలంటీర్ రాజేశ్వరి వేకువజామునే ఆమె పరిధిలో ఉన్న బాధితులకు రక్షణ కల్పించేందుకు ముందుకెళ్లింది. వరద ఉధృతిని లెక్కచేయకుండా గుడిసెలో చిక్కుక్కున్న వెంకటరాముడు, అంకమ్మ, వారి కుటుంబ సభ్యులను రాజేశ్వరి, నగరపాలక సంస్థ సిబ్బంది కాపాడారు. వారిని ఇంటి నుంచి బయటకు తీసుకొచ్చి, పునరావాస కేంద్రానికి తరలించారు. రాజేశ్వరి ఆ రోజు అందించిన సేవలు ఎప్పటికి మరిచిపోలేమని అంకమ్మ వారి కుటుంబ సభ్యులు చెబుతున్నారు. – అనంతపురం క్రైం:

కుటుంబ సభ్యుల్లా చూసుకుంది..



రాజేశ్వరి చేస్తున్న సాయాన్ని ఎప్పటికీ మరువలేం. వరదలు వచ్చినప్పుడు మా ప్రాణాలు పోయినంత పని అయ్యింది. ఇళ్లలోకి నీరు రావడంతో చాలా భయపడ్డాం. వలంటీర్ దగ్గరుండి వేరే ప్రాంతానికి తీసుకెళ్లి ప్రాణాలు కాపాడారు. ప్రతి నెలా మొదటి రోజే రాజేశ్వరి పింఛన్ ఇస్తోంది. కుటుంబ సభ్యురాలి మాదిరిగా సేవలందిస్తోంది.

– అంకమ్మ, గౌరవగార్డెన్ ప్రాంతం

రోడ్ల విస్తరణకు గ్రీన్ సిగ్నల్

- సప్తగిరి సర్కిల్, క్లాక్‌టవర్ సర్వీసు రోడ్ల విస్తరణకు తొలగిన అడ్డంకులు
- రూ.28.5 కోట్ల నిధులు విడుదల చేసిన కేంద్రం
- భూ సేకరణ చేయనున్న రెవెన్యూ అధికారులు

అనంతపురం క్రైం: నగరంలో రోడ్ల విస్తరణకు అడ్డంకులు తొలిగాయి. సప్తగిరి సర్కిల్, క్లాక్‌టవర్ సర్వీసు రోడ్ల విస్తరణ పనులకు గ్రీన్ సిగ్నల్ లభించింది. ఈ మేరకు కేంద్రం నుంచి రూ.28.5 కోట్ల నిధులు విడుదలైనట్లు రెవెన్యూ, ఎన్‌హెచ్ అధికారులకు సమాచారం అందించింది. ఆర్‌ఓబీ బ్రిడ్జ్ ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉండటం, బ్రిడ్జ్ విస్తరణ కాకపోవడంతో ట్రాఫిక్ ఇబ్బందిగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్న రోడ్డును నేషనల్ హైవే పరిధిలోకి తీసుకొచ్చారు. అర్బన్ లింక్ ఎన్‌హెచ్ 42 ప్రాజెక్టు కింద కేంద్ర ప్రభుత్వం రూ.311.93 కోట్లతో రైల్వే ఓవర్ బ్రిడ్జ్ ఫోర్‌వే (9.1 కిలోమీటర్లు) ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా ఇప్పటికే నిర్దేశిత సమయం కంటే ముందుగా కేవలం 15 నెలల్లో



బ్రిడ్జ్ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకున్న విషయం విధితమే. ఇప్పుడు బ్రిడ్జ్‌పై రాకపోకలు సజావుగా జరుగుతున్నాయి.

దశాబ్దాల కల సాకారం..

ప్రధానంగా నగరం నడిబొడ్డున ఉండే సప్తగిరి సర్కిల్ విస్తరణ నగరవాసుల దశాబ్దాల కల. విస్తరణ జరగకపోవడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు అవస్థలు పడేవారు. ల్యాండ్ అక్విజేషన్, బాధితులకు నష్టపరిహారం చెల్లించేందుకు కేంద్ర ప్రభుత్వం తాజాగా రూ.28.5 కోట్ల నిధులు విడుదల చేసింది. దీంతో సప్తగిరి సర్కిల్ ప్రాంతం రోడ్డు మరింత విస్తరణ కానుంది. క్లాక్‌టవర్ సమీపంలోని శాంతి థియేటర్, బెంగళూరు బేకరీ, పోస్టాఫీస్ ప్రవేశమార్గం, పీటీసీ వైపునకు వెళ్లే ఎడమవైపు స్థలం, నిర్మాణాల్లోనూ విస్తరణ పనులు జరగనున్నాయి. ఈ పనులు వేగవంతం చేసేందుకు రెవెన్యూ అధికారులు సిద్ధమయ్యారు. ఈ రెండు ప్రాంతాల్లో విస్తరణ పనులు పూర్తయితే తక్కువ కాల వ్యవధిలోనే నూతన సర్వీసు రోడ్డు అందుబాటులోకి వస్తుంది.

శరవేగంగా నడిమివంక, ఆర్‌యూబీ పనులు

నడిమివంక, రోడ్డు అండర్ బ్రిడ్జ్ (ఆర్‌యూబీ) పనులు శరవేగంగా సాగుతున్నాయి. రానున్న నాలుగైదు నెలల్లో నడిమివంక, ఆర్‌యూబీ అందుబాటులో తెచ్చేందుకు నేషనల్ హైవే, ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వీటి నిర్మాణాలు పూర్తయితే ప్రజలకు ట్రాఫిక్ సమస్య లేకుండా గమ్యస్థానాలకు చేరేందుకు అవకాశం ఉంటుంది. ముఖ్యంగా రోడ్డు అండర్ బ్రిడ్జ్ ద్వారా పాదచారులు, చిన్న వాహనాలు వెళ్లేందుకు సౌలభ్యంగా ఉంటుంది.

444 రోజుల డిపాజిట్ పథకం లాభదాయకం

అనంతపురం సెంట్రల్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) అమలు చేస్తున్న 444 రోజుల కాలపరిమితి కలిగిన డిపాజిట్ పథకం ఎంతో లాభదాయకమని ఆ బ్యాంక్ ఛైర్ పర్సన్ లిఖిత తెలిపారు. బుధవారం డీసీసీబీ సమావేశ మందిరంలో నోడల్ ఆఫీసర్లు, సీనియర్ అధికారులతో ఆమె సమావేశమై మాట్లాడారు. నూతన డిపాజిట్ పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఈ పొదుపు పథకం కింద ఖాతాదారులకు 7.70శాతం, సీనియర్ సిటిజన్‌లకు 8.20 శాతం వడ్డీరేటు వర్తిస్తుందన్నారు. అలాగే బంగారు నగల తాకట్టుపై విరివిగా రుణాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది రూ. 2వేల కోట్ల టర్నోవర్ సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. సీఈఓ రామ్‌ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల పరిశీలన

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలంలోని ఆకుతోటపల్లి, ఇటుకులపల్లి, కందుకూరు ఆర్‌బీకేలను మండల వ్యవసాయధికారిణి జె. శశికళ బుధవారం పరిశీలించారు. మట్టి నమునాల సేకరణ, పీఎం కిసాన్ ఈ–కేవైసీ, రసాయనిక ఎరువుల పంపిణీ, ఇతర రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి మురళీకృష్ణ, వీహెచ్‌ఏలు పావని, హేమావతి, పద్మావతి, అపర్ణ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌పీసీఎల్ సిబ్బంది

ఆత్మకూరు: పరిసరాలు శుభ్రంగా ఉంటేనే అందరం ఆరోగ్యంగా ఉంటామని హెచ్‌పీసీఎల్ డిప్యూటీ జనల్ మేనేజర్ సురేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌సీఎల్ ఆధ్వర్యంలో స్వచ్ఛత పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యమని అలాంటి ఆరోగ్యాన్ని ప్రతి ఒక్కరం కాపాడుకోవాలన్నారు. విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం, క్విజ్ పోటీలు, ఆటల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతనం పాఠశాలకు స్వచ్ఛ భారత్ నిర్వహణకు అవసరమైన సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎమ్ శ్రీనివాస ప్రసాద్, ఉపాధ్యాయులు, హెచ్‌ఎల్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే ముస్లింల సంక్షేమం

అనంతపురం: రాష్ట్రంలో మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందని మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. హర్ దిల్ మే వైఎస్సార్.. హమ్ సబ్ జగన్‌కే సాత్' కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆదర్శ నగర్‌లోని మజీద్ ఈ మౌలానా మహమ్మద్ అబ్దుర్ రజాక్ మసీదులో సమావేశాన్ని నిర్వహించారు. మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, వక్ఫ్ బోర్డు జిల్లా అధ్యక్షుడు ఖాగజ్‌ఘర్ రిజ్వాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నాడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 4 శాతం రిజర్వేషన్ మైనార్టీలకు కల్పించడంతో ఎందరో ముస్లిం యువతీ యువకులు ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. అదే స్ఫూర్తితో నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కార్పొరేటర్ స్థాయి నుంచి డిప్యూటీ సీఎం పదవి వరకూ మైనార్టీలకు రాజకీయ గుర్తింపు ఇచ్చారన్నారు. ముస్లింల పక్షపాతిగా ఉన్న సీఎం జగన్‌మోహన్ రెడ్డికి రానున్న ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలంతా మద్దతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రహంతుల్లా, మసీదు ఇమామ్ మహబూబ్ బాషా, మసీదు కమిటీ సభ్యులు దాదాపీర్, దాదూ, నాయకులు షెక్షావలి, ఖాదర్ పాల్గొన్నారు.



పథకాల కరపత్రాలను చూపుతున్న మేయర్ వసీం, వక్ఫ్ బోర్డు జిల్లా అధ్యక్షుడు రిజ్వాన్

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

అనంతపురం క్రైం: నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో భాగంగా అన్ని లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కమిషనర్ భాగ్యలక్ష్మి హౌసింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కురుకుంట లే అవుట్‌ను పరిశీలించారు. నిర్మాణాలు ఏయే దశలో ఉన్నాయని ఎమినిటీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల కాంట్రాక్ట్ పొందిన ఆర్డీటీ సంస్థ అవసరమైన కార్మికులను సిద్ధం చేసుకుని నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. లే అవుట్‌ల వారీగా పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల స్లాబ్ లెవెల్, లింటల్ లెవెల్ పూర్తయిన వారితో ఒక్కొక్కరికితో రూ.35,000 ఎంత మంది చెల్లించారని ఆరా తీశారు. సంఘాల్లో లేని వారిని సంఘాల్లో చేర్పించి, ఆర్థిక ప్రగతి సాధించేందుకు కృషి చేయాలన్నారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ సావిత్రి, అధికారులు ఉన్నారు.



కురుకుంట లే అవుట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ భాగ్యలక్ష్మి

వైద్య విద్య పీజీ ప్రాక్టికల్ పరీక్షలు షురూ

అనంతపురం క్రైం: జిల్లా బోధనాస్పత్రిలో బుధవారం పీజీ ప్రాక్టికల్ పరీక్షలు మొదలయ్యాయి. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని సర్జరీ, వైద్య కళాశాలలోని ఎస్‌పీఎం విభాగాల్లో పీజీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వివిధ రాష్ట్రల నుంచి వచ్చిన ప్రొఫెసర్లు సర్జరీలో 8 మంది, ఎస్‌పీఎంలో ముగ్గురు పీజీ విద్యార్థులకు వైవా, ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సంబంధిత విభాగాల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

రోగులకు ఉత్తమ సేవలందించాలి

అనంతపురం క్రైం: రోగులకు ఉత్తమ సేవలందించాలని వైద్యాధికారులను డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్ ఆదేశించారు. బుధవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో వైద్యసేవలు, వాటి అమలుపై వివిధ పీహెచ్‌సీల వైద్యాధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి వైద్యాధికారి ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధిగా పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉండాలన్నారు. గర్భస్థ ఆరోగ్య సేవలు, ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ కార్యక్రమం, మాతృత్వ వందన యోజన, బర్త్ ప్లానింగ్, జనన, మరణ నమోదు, ఫ్యామిలీ డాక్టర్ విధానం తదితర అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ చెన్నకేశవులు, డాక్టర్ మనోజ్, డాక్టర్ మహేంద్రనాథ్, స్టాటిస్టికల్ అధికారి మారుతీప్రసాద్, ప్రోగ్రాం మేనేజర్ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్

శభాష్ పోలీస్..

ట్రాఫిక్ నిర్వహణలో కఠినంగా వ్యవహరించే పోలీసులు.. సేవ చేయడంలోనూ ముందు వరుసలో నిలిచారు. బుధవారం నగరంలోని సప్తగిరి సర్కిల్ సెంటర్‌లోకి వచ్చిన ఓ కారు డీజిల్ అయిపోవడంతో అక్కడే ఆగిపోయింది. ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తుతాయనే ఉద్దేశంతో ట్రాఫిక్ పోలీసులు కారును స్వయంగా తోసుకుంటూ పక్కకు తీసుకెళ్లారు. విధి నిర్వహణలో అంకితభావంతో వ్యవహరించిన పోలీసులపై ప్రశంసలు వెల్లువెత్తాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



కారును తోస్తున్న ట్రాఫిక్ పోలీసులు



సప్తగిరి సర్కిల్‌లో ఆగిపోయిన కారు

అనంతకు రేపు స్వామి స్మరణానంద గిరి రాక

అనంతపురం కల్చరల్: అనంత వేదికగా మూడు రోజుల పాటూ యోగదా సత్సంగ మండలి ఆధ్వర్యంలో యోగా ప్రక్రియ సాధనా సమావేశాలు జరుగనున్నాయి. బుధవారం ఆదిమూర్తి నగర్‌లోని సత్సంగ ధ్యాన మండలి కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈనెల 14, 15, 16 తేదీల్లో స్థానిక కృష్ణకళామందిరంలో జరిగే కార్యక్రమాలకు దేశ వ్యాప్తంగా పలువురు సాదకులు విచ్చేసి యోగాలోని సూక్ష్మ రహస్యాలను వివరిస్తారన్నారు. ఈనెల 14న సాయంత్రం 6 గంటలకు యోగదా సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షుడు స్వామి స్మరణానంద గిరి విశిష్ట అతిథిగా విచ్చేస్తారన్నారు.

నేడు ఉప సర్పంచ్ ఎన్నిక

ఆత్మకూరు: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో గురువారం ఆత్మకూరు ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయ్ ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మేజర్ పంచాయతీకి సంబంధించి వార్డు మెంబర్లు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు ప్రారంభం

అనంతపురం అర్బన్: సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు అనంతపురం సమీపంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో బుధవారం ప్రారంభయ్యాయి. మూడు రోజుల పాటు జరగనున్న సమావేశాల్లో మొదటి రోజు జరిగిన కార్యక్రమానికి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, ఎం.ఎ.బేబి, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యుడు ఎం.ఎ.గఫూర్ హాజరయ్యారు. గురు, శుక్రవారాల్లో జరగనున్న సమావేశాల్లో పోలవరం నిర్వాసితుల సమస్య, విద్యుత్ చార్జీల పెంపుదల ఉద్యమం కొనసాగింపు, రాయలసీమ, ఉత్తరాంధ్ర వెనుకబాటు, తదితర అంశాలపై చర్చించి, ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నారు.

పాడి రైతులకు శుభవార్త

- అమ్మ డెయిరీ, ఏడీసీసీ బ్యాంకు ఆధ్వర్యంలో నేడు రుణమేళా

రాప్తాడురూరల్: ఆత్మకూరు మండలంలోని పాడి రైతులకు అమ్మ పాల డెయిరీ శుభవార్త తెలిపింది. ఏడీసీసీ బ్యాంకు సహకారంతో పాడి రైతులకు రుణాలిప్పించేందుకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా గురువారం ఆత్మకూరు సచివాలయం–2 వద్ద రుణమేళా ఏర్పాటు చేస్తున్నారు. మండలంలో 3 వేల మంది పాడి రైతులకు రుణాలిప్పించేలా ప్రణాళిక రూపొందించారు. పాడి పెంపకంపై ఆసక్తి ఉన్న రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కోరారు. ఎమ్మెల్యేతో పాటు ఏడీసీసీ బ్యాంకు ఛైర్‌పర్సన్ లిఖిత, మాజీ ఛైర్మన్ వీరాంజనేయులు, ఏడీసీసీ బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్, డీఆర్డీఏ పీడీ తదితరులు హాజరుకానున్నారు.